క్లుప్తంగా

ఘనంగా అమ్మవార్ల ఒడ్డు పండగలు


కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఆదివారం అమ్మవార్ల ఒడ్డు పండగలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రి సతీష్, నానాజీ కుటుంబ సభ్యులు నూకాంబిక, గంగాలమ్మ, కొత్తమ్మతల్లి మెక్కులు తీర్చుకుని, పూజలు నిర్వహించారు.

రోలుగుంట ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు

రోలుగుంట: స్థానిక ఎంపీడీవోగా కె.వెంకటేశ్వరరావు శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా మామిడి కొత్తూరులో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరావు, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నేడు కేజే పురంలో ఉచిత మెగా వైద్య శిబిరం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు స్థానిక భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు రాపేట రామ కొండల రావు తెలిపారు. స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు విశాఖ అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కమిటీ సభ్యులు

మాకవరపాలెం: మండలంలోని కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, యువతులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు రామాలయం వద్ద బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుర్ల గౌరీశంకర రావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ పనులు


నిర్మిస్తున్న డ్రైనేజీ

గొలుగొండ: చోద్యం గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుతో పాటు ప్రధాన రోడ్డుపై కల్వర్టు, డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నట్టు వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి తెలిపారు.

వేడుకగా ఆంజనేయ తీర్థం

యలమంచిలి రూరల్ : మండలంలోని రామారాయుడుపాలెం ఆంజనేయస్వామి తీర్థాన్ని వేడుకగా నిర్వహించారు. గ్రామ పెద్ద సుంకర వెంకట గిరి దంపతులతో పాటు పలువురు భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం, సింధూరార్చన చేశారు. స్వామిని ప్రత్యేకంగా తయారు చేసిన పూల దండలు, తమలపాకుల దండలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని కొబ్బరికాయలు, అరటి పండ్లు నైవేద్యంగా సమర్పించి, నిమ్మకాయలను స్వామి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం బుర్రకథ ప్రదర్శన అలరించింది.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తురువోలు-జూరెడ్డివాని చెరువు సీసీ తారురోడ్డు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తురువోలు-తంగుడుబిల్లి తారురోడ్డు

పల్లె మురిసింది

- తురువోలులో రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న తురువోలు వెల్‌నెస్ సెంటర్


నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల


ప్రారంభానికి సిద్ధమైన కమ్యూనిటీ భవనం

చీడికాడ: నిత్యం సమస్యలతో కొట్టుమిట్టాడే తురువోలు ఇప్పుడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు పరిష్కారం కాని సమస్యలు కూడా తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల అభివృద్ధిపై సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో తురువోలు అభివృద్ధికి వేదికై ంది. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 16 అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ప్రారంభించనున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలో పర్యటించనున్న డిప్యూటీసీఎం ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ భవనాలతో పాటు జెడ్పీ ఉన్నత, ఎంపీపీ పాఠశాలల్లో నాడు-నేడులో చేపట్టిన అభివృద్ధి పనులకు, రెండు తారు రోడ్లు, సీసీరోడ్లు,ఇంటింటి కుళాయిలు తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, ఉన్నత పాఠశాల నూతన ప్రహరీ నిర్మాణం శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు.

మట్టిరోడ్లు తారురోడ్లుగా..

గ్రామంలో మట్టి రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేశారు. తురువోలు నుంచి జూరెడ్డివాని చెరువు వరకు కొండవీధిరోడ్డుకు అనుసంధానంగా 1.7 కిలోమీటర్ల తారురోడ్డును, రూ.1.33 కోట్ల వ్యయంతో తురువోలు నుంచి చొక్కాకుల వారి కల్లాల మీదుగా సుమారు 3 కిలో మీటర్ల దూరంగల తంగుడుబిల్లి వరకు నిర్మించిన తారురోడ్డును డిప్యూటీ సీఎం ప్రారంభించనున్నారు.

రోడ్డు కష్టాలు తీరాయి



తురువోలు గ్రామంలో ఎక్కువ మంది రైతులకు చెందిన పొలాలు జూరెడ్డివాని బంద కల్లాలు, చొక్కాకులవారి కల్లాల మీదుగా తంగుడుబిల్లి వెళ్లే మార్గాల్లో ఉన్నాయి. అయితే అవి మట్టిరోడ్లు కావడంతో చిన్నపాటి జల్లుకురిసినా కల్లాల నుంచి వచ్చేందుకు తీవ్రంగా ఇబ్బందిపడేవారం. కోసిన పంటలను కల్లాలకు చేర్చేందుకు, ఇంటికి తెచ్చుకునేందుకు అవస్థలకు గురయ్యేవారం.ఈ సమస్యను డిప్యూటీ సీఎం బూడిముత్యాలనాయుడు దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన స్వయంగా వచ్చి ఆ మట్టిరోడ్లను చూసి మా బాధలను అర్థం చేసుకుని తారు రోడ్లు వేయించారు. దీంతో మా కష్టాలు తీరాయి. డిప్యూటీ సీఎంకు రైతులందరం రుణపడి ఉంటాం.

– చొక్కాకుల పైడితల్లి, రైతు , చొక్కాకుల వారి కల్లాలు,తురువోలు


దేవరాపల్లిలో అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



దేవరాపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

సందడిగా పీఏసీఎస్ ఉద్యోగుల సమ్మేళనం


నూకాలమ్మ తల్లి ప్రాంగణంలో గన్నవరం పీఏసీఎస్ ఉద్యోగులు

నాతవరం: మండలంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన గన్నవరం పీఏసీఎస్‌లో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమ్మేళనాన్ని జిల్లేడుపూడి బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. పీఏసీఎస్ ఏర్పాటైనప్పటి నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన వారితో పాటు ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న వారందరూ ఒక చోట చేరి సందడి చేశారు. పదవీ విరమణ చేసిన వై.అయ్యన్నపాత్రుడు, పి.కన్నబాబు, వై.వరహాలబాబు, పల్లి నూకరాజులను ఘనంగా సత్కరించారు. ప్రతి ఏటా ఇదే విధంగా కలుసుకోవాలని, ఎవరికి కష్టం వచ్చినా ఆదుకోవాలని, పీఏసీఎస్ పేరు మీద సమాజానికి ఉపయోగపడే పడే కార్యక్రమాలు చేయాలని తీర్మానించారు. న్యాయవాది, పూర్వ ఉద్యోగి లోకా లోవ రావు ఆధ్వర్యంలో విశ్రాంతి ఉద్యోగి సుర్ల నూకరాజు, ప్రస్తుత ఉద్యోగి సబ్బవరపు అప్పారావు సహకారంతో ఈ సమ్మేళనం నిర్వహించారు.

ఒకే ఈతలో రెండు దూడల జననం


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

బుచ్చెయ్యపేట: మండలంలో కొమ్మళ్లపూడి గ్రామానికి చెందిన రైతు గొన్నా శ్రీనుకు చెందిన ఆవుకు ఆదివారం ఒకే ఈతలో రెండు దూడలు జన్మించాయి. గంట వ్యవధిలో ఇవి పుట్టినట్టు రైతు శ్రీను సంతోషంగా తెలిపాడు.

ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి


వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ హరీష్‌కుమార్

నాతవరం: ప్రజల మన్ననలు పొందేలా ఉద్యోగులు విధులు నిర్వహించాలని నర్సీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ హరీష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోస్టల్ కార్యాలయంలో మండల ట్రాన్స్‌పోర్టు క్లర్కుగా పనిచేసి పదవీవిరమణ చేసిన చిటికెల వెంకటరమణ దంపతులను ఆదివారం సత్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో హరీష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాతవరం మండలం ఎస్‌పీఎం పి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రామనామ జపం జరిగేలా కృషి


మాట్లాడుతున్న శ్రీనివాస్

రోలుగుంట: గ్రామగ్రామానా నిత్యం రామనామ జపం జరిగేలా అందరూ కృషి చేయాలని శ్రీరామ జన్మభూమి సేవక్ శ్రీనివాస్ తెలిపారు. అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను గడపగడపకు పంపిణీ చేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం స్థానిక జీవకారుణ్య సంఘ భవనంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. మండలంలోని 22 పంచాయతీల్లో సుమారు పదివేల గడపలకు అక్షింతలను పంపిణీ చేసినట్టు చెప్పారు. అనంతరం అయోధ్య రామాలయం విశిష్టత గురించి వివరించారు. సమ్మేళనంలో పాల్గొన్న అందరూ 108 సార్లు రామనామ జపం చేశారు. అల్లు గంగాధర్ , ఆడారి గణేష్ పాత్రో, తమరాన సతీష్ ప్రసాద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం


ఎం. కోడూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న సర్పంచ్ తదితరులు


ఎం. కోడూరులో ఎడ్ల పరుగులు పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజీవరావు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరులో మోదకొండమ్మ అమ్మవారి తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు తదితర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలను సర్పంచ్ సంజీవరావు ప్రారంభించారు. అనంతరం గుర్రాల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, చిటికెల భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువకుడి ఔదార్యం

- వృద్ధుడి వైద్యం కోసం ఆర్థికసాయం


నాగరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రమణ

రోలుగుంట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడికి ఆర్థిక సాయం అందించి బుచ్చింపేట గ్రామా నికి అనిమిరెడ్డి రమణ అనే యువకుడు తన ఔదార్యం చాటుకున్నాడు. అదే గ్రామానికి చెందిన ములంపాక నాగరాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్యానికి కొంత నగదు అవసరపడింది. ఈ విషయం తెలుసుకున్న రమణ తన స్నేహితులతో పాటు నాగరాజు ఇంటికి వెళ్లి రూ.5000 వేలు అందజేశాడు.

మార్షల్ ఆర్ట్స్‌లో నర్సీపట్నానికి గుర్తింపు తేవాలి


పతకాలు సాధించిన, శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో అకాడమీ ప్రతినిధులు

నర్సీపట్నం: మార్షల్ ఆర్ట్స్‌లో నర్సీపట్నానికి అంతర్జాతీయి స్థాయి గుర్తింపు తీసుకురావాలని ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అన్నారు. ఈ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆర్.హేమంత్, పూర్ణిమ, ప్రజ్ఞ, మనోజ్‌కుమార్, శోభిత్ ఇటీవల ఉత్తరప్రదేశ్ లోని బెనారస్ యూనివర్సిటీలో జరిగిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ నాగజ్యోతి అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.కిషోర్, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


ఒమ్మలిలో క్రీడా పరికరాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


ఎన్.గజపతినగరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా సభ్యులు

మాడుగుల రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. సత్యవరం, ఒమ్మలి, అవురువాడ, కింతలి వల్లాపురం తదితర గ్రామాల్లో యువకులకు క్రీడా సామగ్రిని ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో కొనుగోలు చేసిన క్రికెట్ బ్యాట్‌లు, క్యారమ్ బోర్డులు, చెస్ బోర్డులు, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర క్రీడా సామగ్రిని అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ టి.వి.రాజారామ్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

దేవరాపల్లి: మండలంలోని ఎన్.గజపతినగరంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా డ్వాక్రా సభ్యులకు రుణమాఫీ చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం చేశారు. సీఎం జగన్‌కు తామంతా అండగా ఉంటామని వారు తెలిపారు.

వలంటీర్ల సేవకులకు సలామ్


కేజీహెచ్‌లో బొడ్డు సత్యవతికి పెంఛన్ అందజేస్తున్న వలంటీర్ గోవాడ నాగ రాజేశ్వరి


నారాయణమ్మకు పించన్ అందిస్తున్న దుర్గాప్రసాద్


బండేసుకు ఫింఛన్ అందిస్తున్న దుర్గాప్రసాద్

దేవరాపల్లి/ రావికమతం: గ్రామ వలంటీర్లు సేవా భావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు అక్కడికి వెళ్లి ఫింఛన్ సొమ్ము అందజేసి మానవత్వం చాటుకున్నారు. దేవరాపల్లి మండలం ఎం.అలమండకు చెందిన బొడ్డు సత్యవతి అనారోగ్యంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా స్థానిక వలంటీర్ గోవా డ నాగ రాజేశ్వరి అక్కడికి వెళ్లి ఫింఛన్ సొమ్ము అందజేశారు. నాగయ్యపేట పంచాయతీ పరిధిలోని కొత్తనాగయ్యపేటకు చెందిన చిటిమిరెడ్డి పైడితల్లమ్మ అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా స్థానిక వలంటీర్ కర్రి ఈశ్వరరావు అక్కడికి వెళ్లి ఫింఛన్ సొమ్ము అందజేశారు.

➡ రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన బంగారు బండేసు కేజీహెచ్‌లో, గొర్లి నారాయణమ్మ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయా ప్రాంతాలకు వెళ్లి ఆగ్రామ వలంటీర్ దుర్గా ప్రసాద్ పింఛన్ అందజేశారు. వలంటీర్లను పింఛన్‌దారుల కుటుంబ సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు ప్రశంసించారు.

జోరుగా రబీ వరినాట్లు

- పుష్కలంగా సాగునీరు
- గత ఏడాది కంటే పెరిగిన సాగు విస్తీర్ణం


లోపూడిలో దమ్ము చేస్తున్న రైతు


కొండెంపూడిలో ఆకు తీస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట : మండలంలో రబీ వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. గతంలో కంటే అధిక విస్తీర్ణంలో ఈ ఏడాది వరి సాగు చేస్తున్నారు. నవంబరు నెలాఖరులో కురిసిన తుపాను వర్షం పంటల సాగుకు అనుకూలించింది. పెద్దేరు, కోనాం రిజర్వేయర్ల నీరు కాలువల ద్వారా అందుతోంది. బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో చెరువులు, వ్యవసాయబావులు నిండుగా ఉండడంతో పుష్కలంగా సాగు నీరు అందుతోంది. పల్లపు ప్రాంతాలతో పాటు మెరక ప్రాంత రైతుల వరినాట్లు వేస్తున్నారు. వడ్డాది, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, నిమ్మలోవ, మంగళాపురం, విజయరామరాజుపేట, లోపూడి, బంగారుమెట్ట, కందిపూడి, ఐయితంపూడి, పెదమదీన తదితర గ్రామాల్లో రైతులు దమ్ములు చేసి, నాట్లు వేస్తున్నారు. గతంలో రెండు వేల ఎకరాల్లో మాత్రమే రబీలో వరినాట్లు వేయగా ఈ ఏడాది మూడు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. సాగునీరు పుష్కలంగా ఉండడంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

180 ఎకరాల్లో వేరుశనగ సాగు


పాడుగుపాలెంలో సాగులో ఉన్న వేరుశనగ పైరు

కె.కోటపాడు : మండలంలోని మెట్ట ప్రాంతాల్లో రబీలో వేరుశనగ పంటను రైతులు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఆర్.వై.అగ్రహారం, చిరికివానిపాలెం, ఉగ్గినవలస, యడ్లవానిపాలెం, వారాడ, వి.సంతపాలెం, పాడుగుపాలెం, కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో 180 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. పంట పూతదశకు వచ్చిన తరువాత ఎకరానికి 200 కిలోల చొప్పున జిప్సంను వేయడం వల్ల పంటలో నూనె దిగుబడి శాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

రోలుగుంట: నిండుగొండ గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవం శనివారం ప్రారంభమైంది. భక్తుల దర్శనార్థం రామాలయం వద్ద ఉత్సవ మూర్తులను ఉంచారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. సర్పంచ్ శెట్టి సంధ్య దంపతులు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ మూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తుల ను గ్రామ వీధుల్లో నేల డ్యాన్సులు, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. సోమవారం అనుపోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.